క్లుప్తంగా

పుల్‌కల్ ఎస్‌ఐగా విశ్వజన్

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ ఎస్‌ఐగా ఎస్ విశ్వజన్ కల్హేర్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ క్రాంతి కుమార్ సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐగా కాశీనాథ్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐగా కాశీనాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐగా ఉన్న కాశీనాథ్ ఈ నెల 7న వీఆర్‌పై సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సంగారెడ్డి నుంచి వినయ్‌కుమార్ బదిలీపై జహీరాబాద్ టౌన్‌కు వచ్చారు. జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐగా ఉన్న ప్రసాద్‌కు సీఐగా పదోన్నతి వచ్చింది. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న కాశీనాథ్ రూరల్ ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉ. 10.30గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ఆర్టీసీ సంస్థ అందిస్తున్న సేవలు, ప్రయాణికుల సమస్యలు, సౌకర్యాల మెరుగుకు 9063417161 నంబర్‌కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

రేపు లోక్ అదాలత్

నారాయణఖేడ్: ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ చాలన్లు, చిన్నపాటి వివాదాల కేసులు పరస్పర అంగీకారం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. కావున కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాయుకాలుష్యంపై ఆందోళన

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేటలో పలు పరిశ్రమలు విడుదల చేస్తున్న వాయు కాలుష్యంతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన వారు వాయుకాలుష్యంతో ఇబ్బంది పడి వెనుదిగారు. పట్టణ పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనీ, సాయిబాబా మందిరం సమీపంలోని గ్రౌండ్‌లో పట్టణ ప్రజలు వాకింగ్‌కు వెళ్తారు. పరిశ్రమలు వదిలే వాయుకాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా సంబంధిత అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి నీరు అందించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు.

నాణ్యత తప్పనిసరి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ ప్రాంతంలో జరుగుతున్న భూగర్భడ్రైనేజీ పనులను గురువారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నాణ్యత లోపిస్తే పైఅధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ నగేష్‌పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

జహీరాబాద్ టౌన్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్య లు తీసుకోవాలని బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ నరేష్ పాటిల్ అధికారులను కోరా రు. ఆయన మాట్లాడుతూ.. అధిక ఫీజులు వసూల్ చేస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవడంలేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలు, యూనిఫాం, షూలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. జహీరాబాద్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యా హక్కు చట్టాన్ని పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

దుస్తులు, పుస్తకాల పేరిట దోపిడీ

నారాయణఖేడ్: యూనిఫామ్స్, పుస్తకాల పేరిట విద్యార్థుల నుంచి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఊరుకోబోమని ఏబీవీపీ ఖేడ్ నగర కార్యదర్శి శంకర్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ.. పలు విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారని అ న్నారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి విజయ్, సంఘం బాధ్యులు విగ్నేష్, శివకు మార్, సంగమేష్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

పండుగలా పునఃప్రారంభం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్,మొగుడంపల్లి మండల్లాలోని పాఠశాలల్లో గురువారం పండుగ వాతావరణం కనిపించింది. పాఠశాలలు పునఃప్రారంభంకావడంతో తొలిరోజు సందడిగా కనిపించింది. ఉపాధ్యాయులు పాఠశాలలను ముస్తాబు చేశారు. ముగ్గులు వేసి స్వాగతం పలికారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.

ఉపాధ్యాయుడు లేక.. ఏడాదిగా మూత

సంవత్సరమంతా తెరవని హత్నూర ఉర్దూ మీడియం స్కూల్

- పిల్లలు రావడం లేదన్న సాకుతో తాళం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

హత్నూర(సంగారెడ్డి): ఉపాధ్యాయుడు లేక ఏడాదిగా ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాల మూత పడింది.. పిల్లలు తక్కువగా ఉన్నారన్న సాకుతో ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపడంతో మరో ప్రైమరీ స్కూల్ ఏడాదిగా మూతపడింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రెండు పాఠశాలల విద్యార్థులు ఏడాదికాలంగా ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం ఈ విద్యా సంవత్సరంలోనైనా రెండు పాఠశాలలు ప్రారంభమైతాయని విద్యార్థులు ఎదురుచూసిన నిరాశే మిగిలింది. ఈ పాఠశాలలో మండల కేంద్రమైన హత్నూరలో ఉన్నాయి. హత్నూరలో మైనార్టీల సంక్షేమం కోసం ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ముస్లిం విద్యార్థులు ఉర్దూ మీడియంలో చేరి కొన్ని సంవత్సరాలుగా విద్యను అభ్యసిస్తున్నారు. కానీ గత ఏడాదిన్నర క్రితం ఉర్దూ మీడియం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో తిరిగి పాఠశాలకు ఉపాధ్యాయుని అధికారులు నియమించలేదు. దీంతో ఉర్దూ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తప్పని పరిస్థితుల్లో కొంతమంది విద్యార్థులు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దౌల్తాబాద్ ఉర్దూ మీడియం పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్నూర ఐటీఐ కాలనీలో ప్రాథమిక పాఠశాల కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. కాలనీలో విద్యార్థులు ఈ పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. కానీ విద్యార్థులు తక్కువ ఉన్నారన్న సాకుతో గత ఏడాది క్రితం పాఠశాలను మూతవేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రాములును హత్నూర మండలం ఎల్లమ్మ గూడా ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. పిల్లలను పాఠశాలలో చేరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా బడిబాట కార్యక్రమం నిర్వహించినప్పటికీ ఈ రెండు పాఠశాలలు మాత్రం నిర్వహించలేదు. ఉర్దూ మీడియం, ఐటీఐ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



ఏడాదిగా మూతపడిన ఉర్దూ పాఠశాల



మూతపడ్డ హత్నూర ఐటీఐ కాలనీ ప్రైమరీ పాఠశాల

ఉపాధ్యాయుడిని నియమించాలి

ఉర్దూ మీడియం పాఠశాలకు వెంటనే ఉపాధ్యాయుడిని నియమించాలి. 30 మంది పైగా విద్యార్థులు ఉండేవారు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజా ప్రతినిధులకు అధికారులకు పలుమార్లు చెప్పిన ఫలితం లేకుండా పోయింది. ఏడాది గడిచిపోయిన ఉపాధ్యాయుడు నియమించలేదు దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



-మహమ్మద్ ఖదీర్

రెండు స్కూళ్లు ప్రారంభించేలా కృషి చేస్తా

మండల కేంద్రం హత్నూరలోని ఉర్దూ మీడియం పాఠశాల, ఐటీఐ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఉర్దూకు ఉపాధ్యాయులు రావడం లేదు. ఐటీఐ పాఠశాలలో చదువుతున్న పిల్లలను హత్నూరలోని ప్రాథమిక పాఠశాలకు ప్రస్తుతం పంపిస్తున్నాం.

- వెంకట్ నరసింహాగౌడ్ ఎంఈఓ

అధిక ధరలకు విత్తనాలమ్మితే చర్యలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా నకిలీ పత్తి విత్తనాలు, పురుగు మందులు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ విషయంపై గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పురుగుమందులను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ విత్తనాలు, ఎరువులు దొరకగా రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారన్నారు. నకిలీ విత్తనాలతో సదాశివపేట, జహీరాబాద్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదాశివపేట, జహీరాబాద్, ఝరాసంగం, రాయికోడు, అందోల్‌లలో అధిక ధరలకు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న అధికారులు స్పందించడం లేదన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, జిల్లా నాయకులు రాజయ్య, రవి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బాలకార్మిక వ్యవస్థను నివారిద్దాం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తారా ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కెవెస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. 14 సంవత్సరాల లోపు బాలబాలికలను పనుల్లో పెట్టుకోవదన్నారు. చట్టాలు అనేకం ఉన్నా నేటికీ సమాజంలోని పరిస్థితుల వల్ల చిన్నారులను కూడా ప్రమాదకరమైన పరిశ్రమలతో పాటు సాధారణమైన పనులలో పెట్టుకోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

తీగల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని గొల్లగూడెం కాలనీలో విద్యుత్ వైర్ల, స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదంగా అల్లుకున్న తీగలను తొలగించారు. సాక్షి దినపత్రికలో గురువారం విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు పిచ్చి మొక్కలు, తీగలను తొలగించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.



తొలగించిన తర్వాత స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్

అర్హులందరికీ ఇళ్లు: ఎమ్మెల్యే



ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదలకు సొంతింటి కల నెరవేరుస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు భూ మిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హు లందరికీ ఇళ్లు మంజూరు చేస్తోందని తెలిపా రు. లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించ డం జరుగుతుందని చెప్పారు. ఎవరైనా మిగి లి ఉంటే ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.

తొలిరోజు నామమాత్రంగా హాజరు

సదాశివపేట(సంగారెడ్డి): వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి బడులు పునః ప్రారంభం కాగా తొలిరోజు స్కూళ్లలో నామమాత్రంగా హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మామిడి తోరణాలు బెలూన్లు, పూవ్వులతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. కొన్ని పాఠశాలల బ్యానర్లు కట్టారు.

సంక్షిప్త వార్తలు

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా ఎనిమిది మందికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **నవోదయ నిర్మాణానికి స్థల పరిశీలన**

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లిలో నవోదయ పాఠశాల కోసం గురువారం నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి స్థలం పరిశీలన చేశారు. గ్రామ శివారులోని 178 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. తహసీల్దార్ నాగజ్యోతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **నీటిసరఫరాకు అంతరాయం**

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులోని సంపు వద్ద మోటారు చెడిపోవడంతో గురువారం ఖేడ్ పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణ, ఎడ్ల బజార్, పెద్దమసీదు, శ్రీరామమందిరం వద్దగల నీటి ట్యాంకులకు సంపునుంచి రావాల్సిన నీటిసరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ట్యాంకుల నుంచి నీరు సరఫరా అయ్యే పలు కాలనీలకు తాగునీటి సరఫరా కాలేదు. దీంతో వెంటనే మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం యథావిధిగా నీటిసరఫరా జరుగుతుందని మున్సిపల్ కమిషనరు జగ్జీవన్ తెలిపారు.

◆ **అరుణాచలంకు ప్రత్యేక బస్సు**

నారాయణఖేడ్: భక్తుల సౌకర్యార్థం ఖేడ్ నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ఈనెల 15న ఖేడ్ నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. 16న మధ్యాహ్నం కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చేరుకుని అక్కడ దర్శనం అనంతరం రాత్రి బయలుదేరి 17న తెల్లవారు జమున అరుణాచలంకు చేరుకుంటుందన్నారు. అక్కడ గిరిప్రదక్షణ అనంతరం బయలుదేరి 18న జోగులాంబ అమ్మవారి శక్తిపీఠాన్ని దర్శించుకున్నాక బయలుదేరి రాత్రికి ఖేడ్‌కు చేరుకుంటుందన్నారు. ఒకొక్కరికి రానుపోను ఛార్జీ రూ.4,500 ఉంటుందన్నారు.

◆ **గర్భిణులకు పౌష్టికాహారం అందజేత**

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ పౌష్టికాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుట్టబోయే పిల్లలకు పౌష్టికాహారం ఎంతో ఆవశ్యకమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాజీ వార్డు సభ్యులు, నాయకులు, గర్భిణీ మహిళలు పాల్గొన్నారు.

◆ **కంప్యూటర్ బహూకరణ**

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ధనసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు గురువారం కంప్యూటర్‌ను బహూకరించారు. 2006–07 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమవంతుగా పాఠశాలకు విలువైన కంప్యూటర్‌ను పాఠశాల పునఃప్రారంభమైన మొదటి రోజు గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. హెచ్‌ఎం రమేష్‌కుమార్ వారిని అభినందించారు.

◆ **నేడు అండర్–19 జట్టు సెలెక్షన్స్**

సంగారెడ్డి క్రైమ్: ఉమ్మడి మెదక్ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో అండర్–19 జట్టు సెలెక్షన్‌లు జరగనున్నాయి. శుక్రవారం సంగారెడ్డిలో శనివారం సిద్దిపేట్ జిల్లాలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ ప్రతాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరుకాగలరు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి నుంచి పలువురు లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయి. ఖేడ్ మండలం నమ్లిమేట్‌కు చెందిన శంకరయ్యకు రూ.22,500, నాగల్‌గిద్ద మండలం పీర్యానాయక్ తండాకు చెందిన రాథోడ్ రావణ్‌కు రూ.12 వేలు, కంగ్టి మండలం చాప్టా(కె)కు చెందిన శివకుమార్‌కు రూ. 49,500, పటాన్‌చెరుకు చెందిన పండరికి రూ. 45 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను గురువారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. పట్టణంలోని రహమాన్ ఫంక్షన్‌హాల్‌లో షాహిన్ గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియా, మొబైల్ వాడకాన్ని నియంత్రించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ కుమార్ మున్వర్ ముజామ్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితం నాలుగు చక్రాల వాహనంలా ఉందని, గురువు, తల్లిదండ్రులు, పాఠశాల మేనేజ్‌మెంట్ వంటి ప్రతి అంశం సమన్వయంతోనే విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుతాడన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు రషీద్, ఖదీర్, తాహెర్ అలీ, బారీసేట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

గ్రంథాలయ జిల్లా చైర్మన్ అంజయ్య

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జి.అంజయ్య అన్నారు. మండలంలోని సింగితం, కర్చల్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను స్కూళ్లకు సరఫరా చేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పి ప్రభుత్వ విద్యాపథకాల ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్, ఎంఈఓ మాణ్యయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న అంజయ్య

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మునిపల్లి, మల్లిఖార్జున పల్లి పాఠశాలలో ఆయా తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. అంతకుముందు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి దామోదర విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

అక్రమాలకు పాల్పడితే చర్యలు

అడిషనల్ డీఆర్డీఓ బాలరాజు

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్డీఓ బాలరాజు హెచ్చరించారు. గురువారం సిర్గాపూర్‌లో ఉపాధిహామీ పనులపై నాలుగవ విడత సామాజిక తనిఖీపై ప్రజా దర్బార్ నిర్వహించారు. ఎస్ఆర్పీ రాజు ఆధ్వర్యంలో డీఆర్పీలు తనిఖీ నివేదికను చదివి వినిపించారు. బాలరాజు మాట్లడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కూలీలకు పనుల గురించి అవగాహన కల్పించాలని కోరారు. లోటుపాట్లపై దిశనిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ఏపీడీరాజు, ఎంపీడీఓ మల్సూర్, ఏపీఓ బస్వరాజ్ పాల్గొన్నారు.



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న బాలరాజు

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వచ్చి దారితప్పి తిరుగుతున్న ఐదుగురు చిన్నారులను పటాన్‌చెరు పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పటాన్‌చెరు సీఐ వినాయకరెడ్డి కథనం ప్రకారం .. బీహార్‌కు చెందిన కొంత మంది బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్నారు. వారి పిల్లలు బుధవారం పటాన్‌చెరులో దారితప్పి తిరుగుతుండగా, గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారి వివరాలను తెలుసుకొని గురువారం సాయంత్రం తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పిల్లల కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం

నారాయణఖేడ్: ఫిట్‌నెస్ లేని పాఠశాల బస్సులను సీజ్ చేస్తామని జహీరాబాద్ ఎంవీఐ వెంకటయ్య స్పష్టం చేశారు. గురువారం సిబ్బందితో కలిసి ఖేడ్‌లోని పలు ప్రైవేటు పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఇప్పటివరకు 80 శాతం బస్సులకు సామర్థ్య పరీక్షలు (ఫిట్‌నెస్) పూర్తి చేసుకున్నాయని తెలిపారు. మిగతా బస్సులను సైతం ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. లేని పక్షంలో బస్సులను సీజ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ వెంకటయ్య

డ్రైనేజీపై అమర్చిన సిమెంట్ బెడ్లు

సాక్షి ఎఫెక్ట్..

సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చౌరస్తా వద్ద 'ప్రమాదకరంగా డ్రైనేజీ' అనే శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించారు. దారి పొడవునా ఎక్కడెక్కడ డ్రైనేజీ పైకప్పు పాడయ్యిందో అక్కడ అక్కడ మరమ్మతులు చేశారు. జేసీబీ సహాయంతో సిబ్బంది సిమెంట్ బెడ్లు అమర్చారు. సాక్షి కథనంతో సమస్యకు పరిష్కారం దొరికిందని మల్కాపూర్‌వాసులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



డ్రైనేజీ పైకప్పుపై వేసిన సిమెంట్ బెడ్లు

విద్యార్థులకు స్వాగతం

వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాల పునఃప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి పేరెంట్స్‌కి గ్రాండ్ వెలకమ్ చెప్పారు. తరగతి గదులను ప్రాంగణాన్ని ముగ్గులతో అలంకరించి పాఠశాలకు విచ్చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పలువురు కొత్త విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇచ్చారు.



నారాయణఖేడ్: యూనిఫాం, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



రాయికోడ్: విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



జోగిపేటలో యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ ఉపాధ్యాయులు



గొంగ్లూర్: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు